# గ్రామీణ పేదరికం.. చైనా అనుభవాలు.. భారత్ వ్యూహం

**అధిక జీడీపీ వృద్ధి పేదరిక తగ్గుదలకు దారి తీస్తుంది. భారత్‌లో ఉత్పత్తి, ఉద్యోగితలో వ్యవసాయరంగ వాటా ఎక్కువ. చైనాలో తయారీరంగ వాటా ఎక్కువ. చైనా ప్రభుత్వం అవలంభించిన విధానాల వల్ల వ్యవసాయదారుల ఆదాయాలు పెరిగి గ్రామీణ పేదరికం తగ్గింది. భూసంస్కరణల సక్రమ అమలు, వ్యవసాయ ఉత్పాదితాలు సకాలంలో సరఫరా వల్ల ఆదాయ అసమానతలు తగ్గి గ్రామీణ పేదరికం తగ్గింది. భారతదేశంలో కూడా నిర్మాణాత్మక మార్పులు అధిక వృద్ధికి, పేదరిక తగ్గుదలకు దోహదపడాలి. గ్రామీణ పేదరిక తగ్గుదల ఈ రెండు దేశాల్లో వేగవంతమవడానికి ప్రభుత్వ విధానాలు అసమానతలు తగ్గించే విధంగా, నిర్మాణాత్మక మార్పులు చలనాత్మకంగా రూపుదిద్దుకోవడానికి దోహదపడాలి.**

భారతదేశంలో ఆదాయ అసమానతలు ఎక్కువగా ఉండటంతో పాటు ప్రపంచంలోని మొత్తం పేదల్లో 1/3వ వంతు ఇక్కడే ఉన్నారని ప్రపంచ బ్యాంకు అభిప్రాయపడింది. మన దేశంలో 1977-78లో 51.3 శాతం మంది, 1993-94లో 36 శాతం మంది ప్రజలు దారిద్ర్య రేఖ దిగువనుండగా 2004-05 నాటికి 27.5 శాతం మంది పేదరికంలో ఉన్నట్లు ప్రణాళిక సంఘం అభిప్రాయపడింది. వీరిలో 75 శాతం మంది గ్రామీణప్రాంతాల్లో నివసిస్తూ దినసరికూలీలుగా, స్వయం ఉపాధి పొందేవారిగా, వ్యవసాయ కూలీలుగా మిగిలిపోయారు. గత రెండు దశాబ్దాలుగా భారత్ స్థిరమైన వృద్ధి కనబరుస్తున్నప్పటికీ... వివిధ సామాజిక వర్గాలు, ఆర్థిక గ్రూపులు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలను పోల్చినపుడు వృద్ధిలో సమానత్వం కన్పించడం లేదు. 1999-2008 మధ్య కాలంలో సాధించిన వార్షిక వృద్ధి రేటు గుజరాత్‌లో 8.8 శాతం, హర్యానాలో 8.7 శాతం, ఢిల్లీ 7.4 శాతంగా ఉండగా.. మధ్యప్రదేశ్ 3.5 శాతం, ఉత్తరప్రదేశ్ 4.4 శాతం, బీహార్ 5.1 శాతం వృద్ధినే మాత్రమే కనబర్చాయి. ఒరిస్సాలోని గ్రామీణ ప్రాంతాల్లో 43 శాతం మంది, బీహార్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో 41 శాతం మంది పేదరికంలో మగ్గుతున్నారు. దేశంలో 2007లో మూడేళ్లలోపు పిల్లల్లో46 శాతం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. 'అసంఘటిత రంగంలోని సంస్థలపై ఏర్పాటు చేసిన జాతీయ కమిషన్' అభిప్రాయంలో 25 శాతం మంది భారతీయులు.. అంటే 236 మిలియన్ల ప్రజలు రోజుకు రూ.20 కంటే తక్కువ మొత్తంతో జీవిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది అసంఘటిత శ్రామికరంగంలో ఉంటూ ఎటువంటి ఉపాధి, సాంఘిక భద్రత లేక పేదరికంలో మగ్గుతున్నారు.

పేదరిక నిర్మూలన మన దేశంలో దీర్ఘకాలిక లక్ష్యంగా భావించాలి. పెరుగుతున్న మధ్యతరగతి ప్రజల 'trickledown' ప్రభావం వల్ల వచ్చే 50 ఏళ్లల్లో పేదరిక నిర్మూలన మంచి ప్రగతిని సాధించగలదు. విద్యపై పెరిగిన శ్రద్ధ, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, మహిళా సాధికారత పెరుగుదల, ఆర్థికంగా వెనకబడిన వర్గాల అభ్యున్నతికి చేపట్టిన ప్రభుత్వ పథకాలు పేదరిక నిర్మూలనకు దోహదపడగలవు. మధ్యతరగతి (middle class) ప్రజల పెరుగుదల భారత్‌లో ఆర్థిక పురోగతిని సూచిస్తుండగా, సంపద పంపిణీలో మాత్రం అసమానతలు అధికమయ్యాయి.

## పెరుగుతున్న మధ్య తరగతి :

సరళీకృత విధానాల ప్రక్రియ నేపథ్యంలో సోషలిస్ట్ నమూనా నుంచి వైదొలగిన తర్వాత భారత్‌లో ప్రతి ఏడాది మధ్యతరగతికి 60-70 మిలియన్ల ప్రజలు తోడవుతున్నారు. మార్విన్ జె.సెట్రాన్ అభిప్రాయంలో భారత్‌లో 390 మిలియన్ల ప్రజలు middle classకు చెందినవారు. ప్రస్తుత వృద్ధిరేటు ఇదే విధంగా కొనసాగినట్లయితే 2025 నాటికి మెజారిటీ ప్రజలు మిడిల్ క్లాస్‌లో ఉంటారని అంచనా. గత కొన్నేళ్లుగా భారత్ అధికవృద్ధి సాధిస్తున్నప్పటికీ గ్రామీణ

ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస పెరుగుతూ ఉండడం వల్ల దీర్ఘకాలంలో పట్టణ పేదరికం ప్రాధాన్యతా అంశంగా మారనుందని ఆర్థికవేత్తల అభిప్రాయం.

భారత్‌లో పేదరికం తగ్గింపు, సాంఘిక సూచికల్లో మెరుగుదల సాధించడమనేది ఆర్థిక వృద్ధి త్వరితగతిన సాధించడం, స్థిర స్థూల ఆర్థిక విధానాలు నిర్వహించడంలో దేశ సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. స్వాతంత్ర్యానంతరం అనేక నిర్మాణాత్మక మార్పులు చోటు చేసుకున్నప్పటికీ వ్యవసాయరంగంపై ఆధార పడిన శ్రామిక శక్తిలో పెద్దగా మార్పు లేదు. భూ సంస్కరణలు సక్రమంగా అమలు జరగనందువల్ల ఆర్థిక స్తోమత కేంద్రీకరణ పెరిగింది. సంస్థాపర పరపతికి పేద రైతులు నోచుకోలేక పోయి నందువల్ల గ్రామీణ రుణగ్రస్తత పెరిగి పేదరికం తీవ్రమైంది.

### చైనా అనుభవాలు :

అధిక స్థూల దేశీయోత్పత్తి వృద్ధి పేదరిక తగ్గుదలకు దారి తీస్తుందనే వాదనకు చైనాను ఉదాహరణగా తీసుకోవచ్చు. భూ పంపిణీలో సమానత ద్వారా వ్యవసాయ ఆదాయాలు పెరిగి పేదరికాన్ని చైనా తగ్గించుకోగలిగింది. నిర్మాణాత్మక మార్పులకను గుణంగా ఉత్పత్తి వృద్ధి కూడా శ్రామిక శక్తి వ్యవసాయ రంగం నుంచి ఇతర రంగాలకు మరలడానికి కారణమైంది. వృద్ధి, పేదరిక తగ్గుదలపై సంస్కరణల యుగంలో చైనా అనుభవాలను పరిశీలించినపుడు స్థిరమైన అధిక వృద్ధి ఒకవైపు జరగగా, మరోవైపు పేదరిక తగ్గుదల కొన్ని కాలాల్లోనే కేంద్రీకృతమైంది. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల మాదిరి కాకుండా చైనా పేదరిక అంచనాలు ఆదాయ దత్తాంశం (Income data)పై ఆధారపడి ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పేదరిక అంచనా వ్యయ దత్తాంశం (Expenditure data)పై ఆధారపడి ఉంటుంది. వ్యయ దత్తాంశంపై ఆధారపడిన అంచనాలు నిరపేక్ష పేదరిక తీవ్రత ఎక్కువగా ఉండటాన్ని సూచిస్తాయి. ఉదాహరణకు 1999లో చైనా అధికారిక ఆదాయ ఆధారిత అంచనాల ప్రకారం గ్రామీణ పేదరికం 5 శాతం. కాగా వ్యయ ఆధారిత అంచనాల ప్రకారం 25 శాతం వరకు ఉంటుంది. అయినప్పటికీ గ్రామీణ పేదరికంలో ఎక్కువ తగ్గుదల 1979–1984, 1995–97 మధ్య కాలంలో కేంద్రీకృతమైంది. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు ఎక్కువగా ఆధారపడిన వ్యవసాయరంగ వృద్ధిపై చర్యలు కేంద్రీకృతమవగా తర్వాత కాలంలో పారిశ్రామికీకరణ వైపు దృష్టి మరల్చారు. 1979–84 మధ్య ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ విధానాలు గ్రామీణ ప్రాంతాలకు అనుకూలంగా ఉన్నాయి. రైతులు అధిక విలువ కలిగిన ఉత్పత్తి ఎంచుకొనేలా ప్రోత్సహించారు. అదేసమయంలో పంట ధరలు ఐదేళ్లల్లో 30 శాతం మేర పెరిగాయి. వ్యవసాయ ఉత్పాదితాలు ముఖ్యంగా రసాయన ఎరువులు సబ్సిడీ ధరలకు రైతులకు అందించారు. ఇటువంటి ప్రోత్సాహక విధానాలు వ్యవసాయ ఆదాయాల పెరుగుదలకు.. తద్వారా పేదరిక తగ్గుదలకు దారి తీసింది. 1990వ దశకం మధ్య భాగంలో చైనాలో గ్రామీణ పేదరికంలో తగ్గుదల గమనించవచ్చు. వర్తక నిబంధనలు (Terms of trade) గ్రామీణ ప్రాంతాలకు అనుకూలంగా ఉండటం కూడా దీనికి కారణమైంది. ఈ దశాబ్దంలో ఆహారధాన్యాల ధరలు రెట్టింపయ్యాయి. చాలాకాలం తర్వాత గ్రామీణ తలసరి ఆదాయాలు పట్టణ ఆదాయాల కన్నా పెరిగి పట్టణ–గ్రామీణ ఆదాయ వ్యత్యాసాలు తగ్గాయి.

1994–97 మధ్య చైనాలో పేదరిక తగ్గుదల అధిక ఆదాయ వ్యాకోచత్వాన్ని నిరూపించింది. వ్యవసాయ రంగంలో ప్రతిఫలాలు ఎక్కువగా ఉండటం దీనికి కారణం. గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్థిక కార్యకలాపాల్లో వ్యవసాయ రంగం ప్రాధాన్యత కలిగి ఉండటం, భూ పంపిణీలో సమానత గ్రామీణ పేదరికం తగ్గుదలకు కారణమైంది. గ్రామీణ–పట్టణ

వలసల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం తగ్గడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా స్థానికంగా నివసించే వారి కంటే వలస వచ్చిన వారిలో పేదరిక తీవ్రత ఎక్కువైంది. వలస కార్మికుల్లో turn over of employment ఎక్కువైనప్పటికీ గృహ, ఆరోగ్య వసతులతో పాటు తమ పిల్లలకు తక్కువ వ్యయంలో నాణ్యమైన విద్య లాంటి సౌకర్యాలు పొందలేకపోయారు. దీనికి తోడు పట్టణ resident status ఉన్న పట్టణ పేదలు ప్రభుత్వం నుంచి 'జీవ నాధార భత్యం' (subsistence allowance) పొందడం వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వలస కార్మికుల స్థితి ఇటీవల సంవత్సరాల్లో ఇంకా దుర్లభమైంది. 1980 దశకం ముందు అధి కారిక అంచనాల ప్రకారం పట్టణ పేదరిక రేటు 2 శాతం.. జనాభా 4 మిలియన్లు. 1989లో అధికారిక అంచనాల ప్రకారం పట్టణ పేదరిక జనాభా మిలియన్‌కు తగ్గింది. కాని అనధికార అంచనాలు మాత్రం చైనాలో పట్టణ పేదరికం ఇంకా ఎక్కువగా ఉందని సూచిస్తున్నాయి. స్థానికులు, వలస ప్రజల ఆదాయాలు, పొందే ప్రయోజనాల మధ్య తేడా ఎక్కువగా ఉండటం దీనికి కారణం. ఇటీవల కాలంలో చైనా ప్రభుత్వం unregistered migrantsకు కొన్ని సౌకర్యాలు కల్పించింది. దీని ప్రభావం పట్టణ పేదరికంపై ఎలా ఉంటుందనేది పరిశీలించాల్సి ఉంది.

పేదరిక తగ్గుదలపై ప్రత్యక్ష ప్రభావం కన్పించడానికి ఆర్థిక వ్యవస్థ వృద్ధి, నిర్మాణాత్మక మార్పులు దోహదపడ్డాయి. ఇటీవల చైనా వృద్ధికి ఉత్పత్తి, ఉద్యోగితలో తయారీరంగం వాటా పెరగడం కారణం. ఇటువంటి ధనాత్మక ప్రభావాలకు వ్యవసాయ రంగ transformation (మార్పులు) ప్రధాన కారణం. 1980వ దశకం ముందు భాగం నుంచి ఉత్పత్తి, ఉద్యోగితలో వ్యవసాయ రంగ వాటా తగ్గింది. కాని భారతదేశంతో పాటు ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఉత్పత్తి, ఉద్యోగితలో వ్యవసాయరంగ వాటా ఎక్కువ. చైనా వృద్ధికి ఉత్పాదకత కలిగిన, remunerative ఉద్యోగిత లభించడం కారణమైంది. దీనికి తోడు 1980వ దశకం ముందు భాగం నుంచి వ్యవసాయరంగంలో శ్రామిక ఉత్పాదకత పెరిగింది. దీనికి సంస్థాపరమైన మార్పులు కారణమయ్యాయి. 1995 నుంచి 2005 వరకు సంస్థాపరమైన మార్పుల వేగం పెరిగి శ్రామిక ఉత్పాదకత రెట్టింపయింది.

గ్రామీణ పేదరిక తగ్గుదలలో ఉపాధి కల్పన ప్రధానాంశం కాగలదు. అధికవృద్ధి సాధిస్తున్న సమయంలో కూడా చైనా ఎదు ర్కొన్న ప్రధాన ఆర్థిక సమస్య నిరుద్యోగం. 2000 సంవత్సరానికి ముందు ప్రతి ఏడాది 10 మిలియన్ల శ్రామిక శక్తి ఉపాధి మార్కెట్లో ప్రవేశించింది. దీనికి తోడు ఇంతకు ముందు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగులుగా ఉన్న 5 మిలియన్లకు తిరిగి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై పడింది. వ్యవసాయ కుటుంబాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లడం వల్ల ఉపాధి సమస్య తీవ్రమైంది. 2003లో చైనా జీడీపీ వృద్ధి 9.1 శాతం వద్ద 8 మిలియన్ల మందికి ఉపాధి కల్పించారు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో ఉపాధి critical issue కాగలదు. ఒకవైపు వృద్ధి మందగించడం తోపాటు ఎగుమతులు తగ్గినందువల్ల ఉపాధి నష్టం సంభవించగలదు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో చైనా పేదరిక తగ్గింపు ప్రయత్నం సత్ఫలితాలనివ్వక పోవచ్చు. ఇతర కార్యకలాపాల్లో ఉపాధి పెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టడం ద్వారా చైనా, భారత్‌లు పేదరిక తగ్గుదలకు కృషి చేయాలి.